సాక్షి
కుమురం భీం
శనివారం, 9, నవంబర్, 2024

సీఈవోను కలిసిన జీఎం



రెబ్బెన: జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి సుదర్శన్ రెడ్డిని శుక్రవారం గోలేటిలో ఏరియా జీఎం శ్రీనివాస్ కలిశారు. సీఈవోకు మొక్క అందించారు.



ఎమ్మెల్యే ఇంటికి సర్వే స్టిక్కర్

ఆసిఫాబాద్‌అర్బన్: సమగ్ర సర్వేలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఇంటికి అధికారులు స్టిక్కర్ వేశారు. డీపీవో భిక్షపతి, అధికారులు ఉన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.2 /18.7

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రతలు బాగా తగ్గుతాయి. చలి ప్రభావం పెరుగుతుంది. రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

వారోత్సవాలు విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో శుక్రవారం నుంచి ఈ నెల 14 వరకు నిర్వహించే బాలల హక్కుల వారోత్సవాలు విజయవంతం చేయాలని జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి భాస్కర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో శుక్రవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాలల హక్కుల వారోత్సవాలు పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీసీపీవో మహేశ్, అధికారులు శారద, బాలప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

17న సెకండ్ ఏఎన్‌ఎంల మహాసభలు

ఆసిఫాబాద్‌అర్బన్: రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని ఎలైట్ హోటల్‌లో ఈ నెల 17న ఎన్‌హెచ్‌ఎం స్కీంలో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంల ప్రథమ మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ తెలిపారు. ఇటీవల డీఎంహెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన సీతారాంను శుక్రవారం జిల్లా కేంద్రంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 17 ఏళ్లుగా పనిచేస్తున్న రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. మహాసభలో భవిష్యత్తు పోరాటాలపై చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్, సెకండ్ ఏఎన్‌ఎంల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుణ్యవతి, నాయకులు భూదేవి, వసంత, లక్ష్మి, మీర, యశోద తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో జిల్లాకు చెందిన గిరిజన విద్యార్థులు ప్రతిభ చూపారని డీఎస్‌వో మీనారెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ నెల 5 నుంచి 7 వరకు ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి గిరిజన క్రీడోత్సవాల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు అథ్లెటిక్స్‌లో 12 బంగారు పతకాలు, 10 వెండి, ఐదు కాంస్య పతకాలు సాధించారని తెలిపారు. అలాగే ఖోఖో అండర్ 14, 17 విభాగాల్లో బాలికలు విజేతలుగా నిలవగా.. బాలురు మూడో స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు శిక్షణ అందించిన పీడీ, పీఈటీలను ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, డీటీడీవో రమాదేవి, ఏసీఎంవో ఉద్ధవ్, జీసీడీవో శకుంతల అభినందించారని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎంవీ రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ 1, స్టెనో/టైపిస్ట్ 1, రికార్డ్ అసిస్టెంట్ 1 పోస్టులు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 22 సాయంత్రం 5 గంటల లోగా అభ్యర్థులు తమ దరఖాస్తులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా న్యాయస్థానం, కుమురంభీం ఆసిఫాబాద్‌కు నేరుగా లేదా రిజిస్టర్ పోస్టు ద్వారా పంపించాలని సూచించారు. డిసెంబర్ 8న ఉదయం 10.30 గంటలకు జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయస్థాన భవన సముదాయంలో అభ్యర్థులకు రాతపరీక్ష ఉంటుందని వెల్లడించారు. ఏ స్థాయిలోనైనా నోటిఫికేషన్ రద్దు చేసే అధికారం జిల్లా ప్రధాన న్యాయమూర్తికి ఉంటుందని స్పష్టం చేశారు.

విద్యార్థినులకు అభినందన



అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల డిగ్రీ గురుకుల కళాశాల విద్యార్థినులు ఈ నెల 4 నుంచి 7 వరకు జనగాంలో జరిగిన రోడ్డు సైక్లింగ్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ శారద తెలిపారు. కళాశాల ఆవరణలో శుక్రవారం పీడీ హారికతో కలిసి క్రీడాకారులను అభినందించారు. స్నేహ రేస్‌లో సిల్వర్, మాస్టర్ రేస్‌లో గోల్డ్ మెడల్ సాధించగా.. శ్రీదేవి, వాణిశ్రీ 25 కిలోమీటర్ల మాస్టర్ రేస్‌లో సిల్వర్ మెడల్ సాధించిందని తెలిపారు.

బాల్య వివాహాలు ఆగేనా..?



- నిర్దేశిత వయస్సు రాకుండానే బాలికలకు పెళ్లిళ్లు
- ఆరోగ్యం, భవితపై తీవ్ర ప్రభావం
- కట్టడి చేయాలని సర్వోన్నత న్యాయస్థానం ప్రత్యేక ఆదేశాలు

పెంచికల్‌పేట్(సిర్పూర్): బాల్యవివాహాలు అరికట్టేందుకు ప్రభుత్వం, అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నా క్షేత్రస్థాయిలో మార్పు రావడం లేదు. గుట్టుచప్పుడు కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కొనసాగుతున్నాయి. పసివయస్సులోనే పెళ్లికావడంతో విద్యార్థినులు చదువుకు దూరమవుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాల్యవివాహాలు నిరోధించటానికి గ్రామస్థాయి నుంచి కమిటీలు వేసినా క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితం రావడం లేదు. అధికారులు నిత్యం సమీక్షలు నిర్వహిస్తున్నా అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో బాల్య వివాహాలు అరికట్టడంపై దేశ అత్యున్నత న్యాయస్థానం పలు మార్గదర్శకాలు విడుదల చేసింది. ప్రతీ జిల్లాకు ఒక కమిటీని ఏర్పాటు చేయడంతోపాటు గ్రామాల్లో ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించింది. బాల్యవివాహ నిషేధ చట్టం -2006 పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

పనిచేయని కమిటీలు



అవగాహన కల్పిస్తున్న జిల్లా బాలల సంరక్షణ అధికారులు(ఫైల్)

జిల్లాలో బాల్యవివాహాలు అరికట్టడానికి ఏర్పాటు చేసిన కమిటీలు సక్రమంగా పనిచేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లా బాలల సంరక్షణ, ఐసీడీఎస్, రెవెన్యూ, పంచాయతీ పాలకవర్గాలతో గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు ఈ కమిటీలు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో జరిగే బాల్యవివాహాలతో కలిగే నష్టాలపై వీరు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలి. బాలురు, బాలికలకు నిర్దేశిత వయస్సు రాకుండానే జరిపించే పెళ్లిలను అడ్డుకోవాలి. అయితే ఈ కమిటీ ఏర్పాటు చేసిన నాటి నుంచి పత్తాలేకుండా పోవడంతో బాల్య వివాహాలు అడ్డుకోవడం సవాలుగా మారింది. పక్కా సమాచారంతో జిల్లాస్థాయి అధికారులు పలుచోట్ల పెళ్లిలను అడ్డుకుంటూ కేసులు నమోదు చేస్తున్నారు. అయితే స్థానిక కమిటీల సహకారం లేకపోవడంతో అనుకున్న లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు.

అత్యున్నత న్యాయస్థానం మార్గదర్శకాలు

బాల్యవివాహాలు బాలికల భవిష్యత్తుపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపుతున్న నేపథ్యంలో సుప్రీం కోర్టు ప్రత్యేక మార్గదర్శకాలు విడుదల చేసింది. ప్రతీ జిలాల్లో బాల్య వివాహ నిషేధ అధికారులు(సీఎంపీవో)ను ప్రత్యేకంగా నియమించాలి. వీరికి ప్రత్యేకంగా పోలీస్ విభాగం కేటాయించాలి. ప్రతీ మూడు నెలలకు ఒకసారి స్త్రీ, శిశు అభివృద్ధి, హోంశాఖలు సమీక్షించాలి. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎస్పీలను భాగస్వాములు చేయాలి. సమాజంలో నెలకొన్న సామాజిక ఆచారాలు, అలవాట్లను నిరోధించటంతోపాటు బాల్య వివాహాలతో కలిగే నష్టాలను తెలియజేయాలి. బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే చట్టప్రకారం తీసుకునే చర్యలపై విస్తృతంగా ప్రచారం కల్పించాలని సూచించింది. బాలికలకు స్వేచ్ఛ వాతావరణం కల్పించి, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని అత్యన్నత న్యాయస్థానం ఆదేశించింది.

చదువుకునే వయస్సులోనే..

జిల్లాలో 334 గ్రామ పంచాయతీలు, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలు ఉన్నాయి. జిల్లాలో గిరిజన జనాభా అధికంగా ఉంది. పేదరికం, అవగాహన లోపంతో ఇప్పటికీ చాలాచోట్ల బాల్యవివాహాలు కొనసాగుతున్నాయి. ఉన్నత విద్యకు స్థానిక అవకాశాలు లేకపోవడంతో బాలికలకు ఇంటర్ తర్వాతే పెళ్లి చేస్తున్నారు. 2022- 23 సంవత్సరంలో అధికారులు 49 బాల్యవివాహాలను అడ్డుకోగా.. 2023- 24లో 18 వివాహాలను అడ్డుకుని బాలికలు, వరుడు కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏజెన్సీ, మారుమూల ప్రాంతాల్లో నిత్యం బాల్యవివాహాలు జరుగుతున్నా వెలుగులోకి రావడం లేదు.

కలిసికట్టుగా పనిచేయాలి



బాల్యవివాహాలు అరికట్టడానికి దేశ అత్యున్నత న్యాయస్థానం జారీ చేసిన మార్గదర్శకాలు ప్రతిఒక్కరూ పాటించాలి. సమాజంలో వివక్షత, సామాజిక రుగ్మతలను రూపుమాపాల్సిన అవసరం ఉంది. క్షేత్రస్థాయిలో కలిసికట్టుగా పనిచేస్తే బాల్య వివాహాలు అరికట్టవచ్చు.

– చాపిడే ప్రకాశ్, సామాజిక కార్యకర్త, పెంచికల్‌పేట్

కేసులు నమోదు చేస్తున్నాం

బాల్య వివాహాలను అరికట్టడానికి క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటికే 18 బాల్య వివాహాలు అడ్డుకున్నాం. ఆయా కుటుంబాలకు వారికి కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు చట్టపరంగా తీసుకునే శిక్షల గురించి వివరించాం. ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి బాల్యవివాహాలపై సమాచారం అందించాలి.

– మహేశ్, జిల్లా బాలల సంరక్షణ అధికారి

అర్హులను ఓటరుగా నమోదు చేయాలి



దేవాపూర్‌లోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్‌రెడ్డి
- పోలింగ్ కేంద్రాలు పరిశీలన

కెరమెరి(ఆసిఫాబాద్): అర్హులైన ప్రతిఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. కెరమెరి మండలంలోని దేవాపూర్, అనార్‌పల్లి, తుమ్మగూడ గ్రామాల్లోని శుక్రవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి పర్యటించారు. స్థానిక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నూతన ఓటరు నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తూ, పేర్లు, చిరునామా, ఇతర తప్పులను సవరించాలని సూచించారు. అలాగే మృతి చెందిన వారి వివరాలను జాబితా నుంచి తొలగించాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే తీరును పరిశీలించారు. వారి వెంట తహసీల్దార్ దత్తుప్రసాద్, ఎంపీడీవో అంజద్ పాషా, డిప్యూటీ తహసీల్దార్ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనవరి 1న తుది ఓటరుజాబితా

కాగజ్‌నగర్‌రూరల్: ఓటరు జాబితా సవరణ కోసం బూత్‌స్థాయి అధికారులతో ఆగస్టు 20 నుంచి సెప్టెంబర్ 15 వరకు ఇంటింటా సర్వే చేపట్టామని, 2025 జనవరి 1న తుది ఓటరు జాబితా ప్రకటిస్తామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలతోపాటు మండలంలోని కోసిని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఓటరు సవరణ కార్యక్రమం ప్రతీ సంవత్సరం కొనసాగుతుందని తెలిపారు. ఈ నెల 9, 10 తేదీల్లో ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం చేపడతామని పేర్కొన్నారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా, తహసీల్దార్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పత్తికి మద్దతు ధర

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు ప్రారంభం



రైతును సన్మానిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: తేమ లేకుండా తీసుకువచ్చే నాణ్యమైన పత్తికి సీసీఐ మద్దతు ధర చెల్లిస్తుందని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కేవీపీ ఆగ్రోటిక్ జిన్నింగ్, రెబ్బెన మండలం కొండపల్లిలోని గౌరీనాథ్ వైట్ గోల్డ్ జిన్నింగ్ మిల్లులో శుక్రవారం సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లను అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, జిల్లా మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్‌తో కలిసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర కల్పించేందుకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని తెలిపారు. రైతులు పత్తిని జిన్నింగ్ మిల్లులకు తరలించే ముందు ప్రభుత్వ నిబంధనల ప్రకారం 8 నుంచి 12 శాతం తేమ ఉండేలా చూసుకోవాలన్నారు. పత్తిని ఆరబెట్టి తేమ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఒకరోజు ముందుగా తమ వివరాలను కొనుగోలు కేంద్రం వద్ద ధ్రువీకరించుకుని పంట తేవాలన్నారు. త్వరలో జిల్లాలోని మిగిలిన జిన్నింగ్ మిల్లుల్లో కూడా కొనుగోళ్లు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పత్తి రైతును శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జిన్నింగ్ యజమానులు విశ్వప్రసాద రావు, రఫీక్ జివాని, వ్యాపారులు పాల్గొన్నారు.

ప్రతీ గ్రామానికి టెలికాం సేవలు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: జిల్లాలోని ప్రతీ గ్రామానికి టెలికాం సేవలు అందించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, తెలంగాణ టెలికాం సర్కిల్ జాయింట్ సీసీ ఏసీఎం సంపత్‌తో కలిసి బీఎస్ఎన్ఎల్, టీ ఫైబర్, ఎయిర్‌టెల్, జియో నెట్‌వర్క్‌ల ప్రతినిధులు, విద్యుత్, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ టెలికాం సేవలు అందని గ్రామాల్లో టవర్ల నిర్మాణం వెంటనే పూర్తిచేసి సేవలు విస్తరించాలన్నారు. ప్రజల ఇబ్బందులు తొలగించేలా టెలికాం అధికారులు ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టెలికాం సర్కిల్ జాయింట్ సీసీ ఏసీఎం సంపత్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతీ ఆవాస ప్రాంతాల్లో టీఫైబర్ ద్వారా సేవలందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎయిర్‌టెల్, జియో సంస్థల సమన్వయంతో ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి తెస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంపూర్ణత అభియాన్ లక్ష్యాలు సాధించాలి

ఆసిఫాబాద్: జిల్లాలో సంపూర్ణత అభియాన్ లక్ష్యాలు సాధించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి విద్య, వైద్యం, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, సంక్షేమ, విద్యుత్, పంచాయతీరాజ్, మిషన్‌భగీరథ అధికారులతో సంపూర్ణత అభియాన్ స్పెషల్ అస్పిరేషన్ జిల్లా కార్యక్రమంలో భాగంగా తిర్యాణి బ్లాక్‌లో చేపట్టిన ఆరు అంశాల పురోగతిపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. త్వరలో కేంద్ర మంత్రి పర్యటించనున్న నేపథ్యంలో ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీవో దత్తారావు, అదనపు డీఆర్‌డీవో రామకృష్ణ, జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, డీపీవో భిక్షపతి, పంచాయతీరాజ్ ఈఈ భాస్కర్, డీఈవో యాదయ్య పాల్గొన్నారు.

నిమ్స్‌లో కొనసాగుతున్న చికిత్స

వాంకిడి(ఆసిఫాబాద్): వాంకిడి మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స కొనసాగుతోంది. మంచిర్యాలలో చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించడంతో జ్యోతి, మహాలక్ష్మి, శైలజను హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం జ్యోతి, మహాలక్ష్మి కోలుకున్నారని, శైలజకు గురువారం వరకు వెంటిలేటర్‌పై వైద్యం అందించారు. శుక్రవారం శైలజ కొంత కోలుకోవడంతో ఉదయం జనరల్ వార్డుకు షిఫ్ట్ చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా.. 60 మందికి పైగా విద్యార్థినులు అస్వస్థతకు గురై వారం రోజులు గడిచినా అధికారులు ఇప్పటివరకు కారణాలు వెల్లడించకపోవడం, బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

విద్యార్థినులకు పరామర్శ

హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్న వాంకిడి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శుక్రవారం పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి బాగోగులు తెలుసుకున్నారు. బాలికల తల్లిదండ్రులతో మాట్లాడి అధైర్య పడొద్దని సూచించారు. కమిషన్ సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణ, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప తదితరులు ఉన్నారు.



విద్యార్థినితో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

అంగన్‌వాడీ కేంద్రాల్లో డ్రెస్‌కోడ్

- తొలి విడతలో 410 అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ
- 8,118 మంది చిన్నారులకు అందించేందుకు చర్యలు
- కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మారనున్న కేంద్రాలు

తొలివిడతలో యూనిఫాంల పంపిణీకి ఎంపిక చేసిన కేంద్రాలు..

ప్రాజెక్టు పరిధి	అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య
ఆసిఫాబాద్	116
వాంకిడి	21
జైనూర్	101
కాగజ్‌నగర్	52
సిర్పూర్	120



బాలురకు అందించే యూనిఫాం



బాలికలకు అందించే గౌను

ఆసిఫాబాద్‌అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పలు రకాల పథకాలను అమలు చేస్తుంది. అందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్యను అభ్యసించే చిన్నారులకు సైతం డ్రెస్‌కోడ్‌ను అమలు చేయనున్నారు. ఇప్పటి వరకు పాఠశాల స్థాయి విద్యార్థులకే యూనిఫాంలు అందించారు. ఇక నుంచి అంగన్‌వాడీల్లో 3 సంవత్సరాల వయస్సు నుంచి 6 సంవత్సరాల వయస్సులోపు చిన్నారులకు ఉచితంగా ఏకరూప దుస్తులు అందించాలని నిర్ణయించారు. ఈ మేరకు స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలు వాటిని కుట్టారు. త్వరలో యూనిఫాంలు పంపిణీ చేసేందుకు మహిళా శిశు సంక్షేమ శాఖ చర్యలు తీసుకుంటుంది.

తొలివిడతలో 410 కేంద్రాల్లో..

ప్రభుత్వ పాఠశాలలకు అనుబంధంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలలో తొలి విడతలో డ్రెస్‌కోడ్ అమలు చేయాలని నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా 5 ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో మొత్తం 973 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందులో తొలి విడతలో 410 కేంద్రాల్లో 8,818 మంది చిన్నారులకు ఏకరూప దుస్తులు అందించనున్నారు. తొలి విడతలో జిల్లాకు మొత్తం 8,035 మీటర్ల క్లాత్ రాగా అందులో 8,818 మంది చిన్నారులకు యూనిఫాంలు కుట్టించారు. చిన్నారులు ఇక యూనిఫాంలతో అంగన్‌వాడీ కేంద్రాల్లో సందడి చేయనున్నారు.

అన్ని హంగులతో..

జిల్లాలో పలు అంగన్‌వాడీ కేంద్రాలను సరికొత్త హంగులతో రూపుదిద్దుతున్నారు. తొలి విడతలో 11 కేంద్రాలకు మరమ్మతులు, రంగులు వేయడం, ఇతర అభివృద్ధి పనులకు గాను ఒక్కో కేంద్రానికి రూ. 2లక్షలు కేటాయించారు. కాగా అంగన్‌వాడీ కేంద్రాలకు రంగులు వేసే పనులు పూర్తి కానున్నాయి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా కలర్ బెంచీలు, ర్యాక్‌లు ఏర్పాటు చేయనున్నారు.

పిల్లలను ఆకర్షించేలా డిజైన్‌లు..

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులను ఆకర్షించేందుకు పలు రకాల డిజైన్‌లలో ఏకరూప దుస్తులను ప్రభుత్వం ఎంపిక చేసింది. బాలికలకు ఫ్రాక్, బాలురకు నిక్కర్, షర్టు ఇవ్వనున్నారు. యూనిఫాంతో చిన్నారులు మరింత మురిసిపోనున్నారు. తల్లిదండ్రులు కూడా యూనిఫాంలతో తమ పిల్లలను చూసి సంతోషంగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపేందుకు మొగ్గు చూపే అవకాశం ఉంది. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి లాంఛనంగా యూనిఫాంల పంపిణీ ప్రక్రియను ప్రారంభించనున్నట్ల అధికారులు పేర్కొంటున్నారు.

పంపిణీకి సిద్ధం



ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే అంగన్‌వాడీ సెంటర్‌లకు వస్తున్న చిన్నారులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. తొలి విడతలో ఎంపిక చేసిన కేంద్రాల్లోని చిన్నారులకు త్వరలోనే యూనిఫాంలు అందించనున్నాం. ఇప్పటికే డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో దుస్తులు కుట్టించాం. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉండాలనే ఉద్దేశంతో చిన్నారులకు యూనిఫాంలను అందజేస్తున్నాం. పలు అంగన్‌వాడీ కేంద్రాల కు రంగులు, మరమ్మతులు సైతం చేయిస్తున్నాం.

– భాస్కర్, డీడబ్ల్యూవో

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థినులు అనారోగ్యం బారినపడిన ఘటనలో బాధ్యులైన డీటీడీవో, ఏటీడీవో, హెచ్‌ఎంలపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలతో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని ఆరోపించారు. మంచిర్యాలలో డీటీడీవోతోపాటు హెచ్‌ఎంను సస్పెండ్ చేయగా.. జిల్లాలో మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మల్లేశ్, ఏపీపీఎస్ జిల్లా కార్యదర్శి దినకర్, నాయకులు టీకానంద్, సుధాకర్, రవిదాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రగ్బీ పోటీలకు విద్యార్థులు ఎంపిక



విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

బేల: మండలకేంద్రంలోని మహాత్మా జ్యోతి బాపూలే గురుకులానికి చెందిన 9వ తరగతి విద్యార్థులు ఎ.లఖన్, బి.సాయిచరణ్, ఎం.ప్రదీప్‌లు రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జరిగిన జోనల్ స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చి, ఈ నెల 10 నుంచి హైదరాబాద్ మల్కాజిగిరిలో జరిగే రాష్ట్రస్థాయి అండర్ 17 పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం ముగ్గురు విద్యార్థులను ప్రిన్సిపాల్ రంగన్న, ఉపాధ్యాయ బృందం అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ శివన్న పాల్గొన్నారు.

మునిపల్లి విద్యార్థికి జాతీయ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న కల్లెడ అభిలాష్

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లి గ్రామానికి చెందిన విద్యార్థి కల్లెడ అభిలాష్ జాతీయ పురస్కారం అందుకున్నారు. మండలంలోని మునిపెల్లి గ్రామానికి చెందిన కల్లెడ పవిత్ర – ప్రసాద్ దంపతుల కుమారుడు అభిలాష్ తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ, మాచి రాజు సాహిత్య కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ కథల పోటీల్లో పాల్గొని 'మంచి మనుసు' అనే కథా సంపుటిని రాశారు. ఇందుకు జాతీయ పురస్కారం లభించింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శుక్రవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారం అందుకున్నారు. అభిలాష్ జగిత్యాల జిల్లాలోని ఏర్గట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తికి జైలు

మంచిర్యాలక్రైం: రోడ్డు ప్రమాదానికి కారణమైన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం మర్కటోలకు చెందిన కిషోర్‌కుమార్‌కు మంచిర్యాల స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ జడ్జి ఉపనిషధ్వని ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. మంచిర్యాల పట్టణ సీఐ ప్రమోద్‌రావు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. భీమిని మండలం మల్లిడి గ్రామానికి చెందిన దుర్గం చంద్రయ్య మంచిర్యాల పట్టణంలోని బెల్లంపల్లి చౌరస్తాలో 2016 అక్టోబర్ 14న రోడ్డుపై లారీ ప్రమాదానికి గురై చనిపోయాడు. అతడి భార్య తలకు గాయమై ఆస్పత్రిలో చేరింది. అప్పటి ఎస్సై అశోక్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో ప్రమాదానికి కారణమైన కిషోర్‌కుమార్‌కు జైలు శిక్ష విధించారు.

కుక్క పిల్లలకు బారసాల



బారసాల చేస్తున్న రవి కుటుంబ సభ్యులు

కడెం: నిర్మల్ జిల్లా కడెం మండలం చిన్నబెల్లాల్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ గిరివేణి రవి తన ఇంట్లో కుక్క పిల్లలకు శుక్రవారం బారసాల చేశాడు. రవి పెంచుకుంటున్న కుక్క ఇటీవలే మూడు పిల్లలకు జన్మనిచ్చింది. శుక్రవారానికి అవి పుట్టి 21 రోజులు కావడంతో బారసాల చేశాడు. బంధువులను, చుట్టుపక్కల వారిని పిలిచి అందరికీ భోజనాలు పెట్టాడు.

మ్యాట్రీమోని పేరుతో రూ.17లక్షలు



ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లాకు చెందిన ఎర్ర వెంకటనాగరాజు, సౌజన్య దంపతులు మ్యాట్రీమోని పేరుతో అందమైన అమ్మాయిల ఫొటోలతో ఫేస్‌బుక్ ఖాతా ఏర్పాటు చేసి ఇతరులకు ఫ్రెండ్ రిక్వెస్ట్ చేయడం, పెళ్లి సంబంధాల కోసం వివరాలు ఇచ్చిన వారికి ఫ్రెండ్ రిక్వెస్ట్ పెట్టడం, ఫ్రెండ్ రిక్వెస్ట్ అక్సెప్ట్ చేయగానే వారితో చాటింగ్ చేస్తూ పరిచయం పెంచుకుని కొంతకాలం తర్వాత బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బులు డిమాండ్ చేసేవారు. ఈ క్రమంలో జిల్లాకు చెందిన ఓ యువకుడిని బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు డిమాండ్ చేయగా.. దశలవారీగా రూ.17లక్షలు ముట్టజెప్పాడు. అయినా వేధింపులు ఆగకపోవడంతో యువకుడు రామగుండం సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు వెంకటనాగరాజు, సౌజన్యలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పార్ట్‌టైమ్ ఉద్యోగం అంటూ..



ఇన్‌స్టాగామ్ యాప్‌లో పార్ట్ టైమ్ ఉద్యోగం పేరుతో నస్పూర్‌లోని రాంనగర్‌కు చెందిన అడెపు శివకుమార్‌తోపాటు తన బంధువులు, స్నేహితులు రూ.1,57,319 సైబర్ మోసగాళ్ల చేతిలో నష్టపోయారు. శివకుమార్ తన ఇన్‌స్టాగామ్ యాప్‌లో పార్ట్ టైం ఉద్యోగం లింక్‌ను ఓపెన్ చేయగా టెలిగ్రామ్ యాప్‌లో సయ్యద్ మెకలిన్ అనే గుర్తు తెలియని వ్యక్తుల ప్రొఫైల్స్‌తోపాటు మరికొందరికి చెందిన ప్రొఫైల్స్ ఓపెన్ అయ్యాయి. కొంత పెట్టుబడి పెడితే రెట్టింపు డబ్బులు వస్తాయని చెప్పడంతో పలు దఫాలుగా రూ.1,57,319 ఫోన్ పే ద్వారా పంపించారు. సమాధానం రాకపోవడం, ఫోన్లు స్విచ్చాఫ్ రావడంతో సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

క్రిప్టో మోసం..



క్రిప్టో పేరుతో సీతరాంపల్లి గ్రామానికి చెందిన బొల్లం భీమయ్య రూ.67వేలు నష్టపోయాడు. 2024 అక్టోబర్ 10న తన ఇన్‌స్టాగామ్ యాప్‌లో క్రిప్టో అనే పేజీ ప్రకటనలో రూ.10వేలు పెట్టుబడి పెడితే రెట్టింపు డబ్బు వస్తుందని చెప్పడంతో భీమయ్య గుర్తు తెలియని వ్యక్తి పంపిన బ్యాంకు ఖాతాకు పలు దఫాలుగా రూ.67వేలు పంపించాడు. సదరు వ్యక్తి నుంచి సమాచారం రాకపోవడం, ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నంబర్ 1930లో ఫిర్యాదు చేయగా రూ.32వేలు ఫ్రీజ్ చేశారు.

- మ్యాట్రీమోని పేరుతో మోసాలు
- ఓటీపీ చెప్పకపోయినా బ్యాంకు ఖాతా ఖాళీ

సైబర్ చోరులు



మంచిర్యాలక్రైం: ఆధునిక టెక్నాలజీని తమకు అనుకూలంగా మలుచుకుని కొందరు సైబర్ మోసాలకు పాల్పడుతున్నారు. ఎప్పటికప్పుడు కొత్త దారులు వెతుకుతూ దోచుకుంటున్నారు. పోలీసు యంత్రాంగం ఎంత అప్రమత్తం చేస్తున్నా ఎక్కడో ఒక చోట మోసాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. ఝార్ఖండ్‌లోని జమ్‌తార జిల్లాలోని ఏడు గ్రామాలకు చెందిన యువత సైబర్ నేరాలే ప్రధాన ఆదాయ వనరుగా మలు చుకుని మోసాలకు పాల్పడుతున్నట్లు సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు. బ్యాంకుల్లోని ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, కాల్‌సెంటర్లు తదితర మార్గాల్లో డెబిట్ కార్డుల డేటా సైబర్ మోసగాళ్లకు చేరుతోంది. బోగస్ పేర్లు, చిరునామాలతో సిమ్‌కార్డులు తీసుకునే జమ్‌తార యువకులు వాటి విని యోగానికి బేసిక్ మోడల్, తక్కువ ఖరీదున్న సెల్‌ఫోన్లు వాడుతుంటారు. వీటితో తమ వద్ద ఉన్న సమాచారంతో బ్యాంకు వినియోగదారులకు ఫోన్ చేస్తుంటారు. ఇటీవల కాలంలో అందరి ఫోన్లలోనూ ట్రూ కాలర్ తరహా యాప్స్ ఉంటున్నాయి. బోగస్ సిమ్‌కార్డుల వినియోగదారులు ముందుగానే ఆయా నంబర్లను సదరు యాప్‌లో 'బ్యాంకు హెడ్ ఆఫీస్' పేరుతో రిజిష్టర్ చేస్తున్నా రు. ఫలితంగా ఈ నంబర్ నుంచి ఫోన్ రాగానే బ్యాంకు నుంచి అనే భావన కలిగి తేలిగ్గా బుట్టలో పడుతున్నారు. ప్రతీ లావాదేవీకి ఒక ఓటీపీ కచ్చితంగా ఉండాలి. దీనిని పదేపదే వినియోగదారుడిని అడగకుండా కొత్త ఎత్తు వేస్తున్నారు. లక్ష్యంగా చేసుకున్న వారికి లింకులు పంపించడం ద్వారా టీమ్ వ్యూయర్ యాప్స్ డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఓ పాస్‌వర్డు చెప్పి యాక్టివ్ చేసుకోవాలని చెబుతున్నారు. బాధితుడు యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని యాక్టివేట్ చేసిన వెంటనే ఫోన్ స్క్రీన్ సైబర్ నేరగాడి ల్యాప్‌టాప్‌లో కనిపిస్తుంది. ఫలితంగా వచ్చిన ప్రతీ ఓటీపీని అడగాల్సిన పని లేకుండానే వీలైనంత వరకు ఖాతా ఖాళీ చేయడానికి ఆస్కారం ఏర్పడుతోంది.

పకడ్బందీ పరిశోధనతోనే..

ఒక్కసారి బాధితుడి ఖాతా నుంచి ఖాళీ అయిన డబ్బులు రాబట్టడం అంత సులభమేమి కాదు. తెలంగాణ పోలీస్ యంత్రాంగం సైబర్ నేరగాళ్లకు సంకెళ్లు వేసేందుకు పోలీస్ సిబ్బందికి ప్రత్యేక అవగాహన, శిక్షణ కల్పించింది. ఫిర్యాదు అందిన వెంటనే బాధితుడు పోగొట్టుకున్న డబ్బు ను రాబట్టడంపై దృష్టి సారిస్తున్నారు. అనంతరం నేరస్తులు వినియోగించిన సెల్‌ఫోన్ నంబర్ల ఆధారంగా బాధితుడి ఖాతా నుంచి డబ్బు ఎక్కడికి బదిలీ అయింది..? ఆన్‌లైన్ షాపింగ్ జరిగితే ఏ చిరునామాకు వస్తువు, సామగ్రిని ఆర్డర్ చేశారు..? తదితర వివరాల ఆధారంగా దర్యాప్తు చేస్తారు.

11యాప్‌లు గుర్తించాం..



సైబర్ నేరగాళ్లు ఉపయోగించే 11యాప్‌లను గుర్తించాం. వీటిని ఇన్‌స్టాల్ చేసుకుని పాస్‌వర్డు సైబర్ నేరగాళ్లకు చెబితే మన ఫోన్ వారి యాక్సెస్‌లోకి వెళ్తుంది. ఇలాంటి యాప్స్‌ను సైబర్ నేరగాళ్లు వినియోగించాలంటే కచ్చితంగా బాధితుడి ఫోన్ యాక్టివ్‌గా ఉండాలి. స్క్రీన్ లాక్ చేస్తే నేరగాళ్లు యాక్సెస్ చేయలేరు. అందుకే వీటిని వినియోగించి టోకరా వేసే సైబర్ క్రిమినల్స్ ఆ సమయంలో బాధితులకు ఫోన్ చేసి మాటల్లో ఉంచుతారు. అపరిచితులు పంపే లింకులు ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయకూడదు. బ్యాంకర్లు ఫోన్లు చేయరు, వ్యక్తిగత సమాచారం అడగరని గుర్తుంచుకోవాలి. ఏమాత్రం అనుమానం వచ్చినా వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

– ఎం.శ్రీనివాసులు, రామగుండం పోలీస్ కమిషనర్

లక్ష్యాన్ని సాధించాలంటే పట్టుదల, క్రమశిక్షణ ఉండాలి

- బిహార్ పరిపాలనా విభాగం ముఖ్య కార్యదర్శి బొమ్మకంటి రాజేందర్



పాఠశాలలో మాట్లాడుతున్న రాజేందర్

బోథ్: కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఉంటే లక్ష్యాన్ని సాధించవచ్చని బిహార్ రాష్ట్రంలో పరిపాలన విభాగం ముఖ్య కార్యదర్శి బొమ్మకంటి రాజేందర్ అన్నారు. బోథ్ మండలంలోని కౌఠబి గ్రామానికి చెందిన రాజేందర్ ప్రస్తుతం బీహార్ రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల తన సొంత గ్రామానికి వచ్చిన ఆయన తాను చదువుకున్న పాఠశాలను శుక్రవారం సందర్శించారు. పాఠశాలలో తిరుగుతూ తన చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. పాఠశాలలో అమలవుతున్న పథకాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఉపాధ్యాయులతో ముచ్చటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరచుకుని, వాటిని సాధించేందుకు ప్రయత్నించాలన్నారు. తాను ఐఏఎస్ కావడానికి తాను పుట్టి పెరిగిన గ్రామం, చదవిన పాఠశాలే కారణమన్నారు. గ్రామాభివృద్ధికి తనవంతు సహకారం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై ప్రవీణ్ కుమార్, విశ్రాంత ఉపాధ్యాయులు వినాయక్ రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు బడాల శ్రీకాంత్ రెడ్డి, మాజీ సర్పంచ్ రవీందర్, సోమేశ్వర్, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మందమర్రిలో నకిలీ నోట్ల కలకలం



వ్యాపారి వద్ద ఒకే నంబర్‌తో ఉన్న రూ.200 నోట్లు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని పాలచెట్టు ఏరియా కూరగాయల మార్కెట్‌లో నకిలీ కరెన్సీ నోట్లు కలకలం రేపుతున్నాయి. హోల్‌సేల్ కూరగాయల వ్యాపారి పవన్‌కుమార్ చిరు వ్యాపారులకు కూరగాయలు వేసి సాయంత్రం డబ్బులు తీసుకెళ్తుంటాడు. ఈ క్రమంలోనే ఈ నెల 5న కూరగాయల వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేసుకుని ఇంటికి వెళ్లి లెక్కించే సమయంలో నకిలీ రూ.200 నోట్లు కనిపించాయి. ఒకే నంబరుతో ఉన్న మూడు కరెన్సీ నోట్లు దర్శనమిచ్చాయి. గురువారం రూ.200 నోట్లు మరో రెండు ఆయనకే వచ్చాయి. వీటిపైనా ఒకే నంబర్లు ఉండడం గమనార్హం. మార్కెట్‌లో రూ.200, రూ.500 నోట్లు నకిలీవి చెలామణి అవుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నకిలీ నోట్ల విషయమై ఎస్సై రాజశేఖర్‌ను సంప్రదించగా.. వ్యాపారి పవన్‌కుమార్‌కు నకిలీ నోట్లు వచ్చాయని తెలిపాడని, ఆ నోట్లను తీసుకుని రావాలని సూచించగా రాలేదని పేర్కొన్నారు. నకిలీ నోట్లపై పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానం వస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు.

కలప పట్టివేత



పట్టుకున్న కలపతో అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: ఆసిఫాబాద్ రేంజ్ పరిధి దంతన్‌పల్లి సెక్షన్ ప్రాంతంలోని డోర్లి 2 వద్ద గురువారం రాత్రి రెండు గంటల ప్రాంతంలో అటవీ అధికారులు అక్రమంగా తరలిస్తున్న కలపను పట్టుకున్నారు. ఆసిఫాబాద్ రేంజ్ అధికారి గోవింద్‌సింగ్ సర్దార్ తెలిపిన వివరాల ప్రకారం.. కౌటన్ మోవాడ్ నుంచి మందమర్రి వైపు వెళ్తున్న కారు(ఏపీ 10 ఏజీ 6165)ను డోర్లి ప్రాంతంలో ఆపడానికి అటవీశాఖ సిబ్బంది ప్రయత్నించారు. వీరిని చూసి నిందితులు కారు వదిలి పారిపోతుండగా పట్టుకున్నారు. కారులో 12 కలప దుంగలు ఉండగా.. వాటి విలువ రూ.56,236 ఉంటుందని తెలిపారు. నిందితులు కృష్ణ, శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సెక్షన్ అధికారులు మహేందర్, సాయి, విజయ్, బీట్ అధికారులు ప్రకాశ్, సాదిక్, స్వప్న పాల్గొన్నారు.

వరకట్న వేధింపులకు వివాహిత బలి



వివాహిత మృతదేహం వద్ద వివరాలు నమోదు చేసుకుంటున్న తహసీల్దార్, ఎస్సై

దస్తురాబాద్: వరకట్న వేధింపులకు జిల్లాలో మరో వివాహిత బలైంది. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండంలోని రేవోజీపేట గ్రామానికి చెందిన సంద నాగరాజుకు జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం రేచపల్లి గ్రామానికి చెందిన లతతో ముడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి 15 నెలల కుమారుడు ఉన్నాడు. కొన్ని రోజులుగా భర్త నాగరాజు, అత్త, మామ సంద సత్తవ్వ, వెంకటి అదనపు కట్నం తేవాలని లతను వేధిస్తున్నారు. వేధింపులు ఎక్కువ కావడంతో శుక్రవారం బాత్‌రూంలో ఉరివేసుకుంది. సంఘటన స్థలాన్ని తహసీల్దార్ నావాజ్ సర్ఫరాజ్ చేరుకుని పంచనామా చేశారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. మృతురాలి తల్లి పోగుల మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలింత అదృశ్యం

- మూడు రోజుల క్రితం ఆడపిల్ల జననం
- శుక్రవారం మధ్యాహ్నం నుంచి కనిపించని తల్లి
- నిర్మల్ మాతాశిశు ఆస్పత్రిలో ఘటన



నాగమణి

నిర్మల్‌టౌన్: నిర్మల్ జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆస్పత్రి నుంచి బాలింత శుక్రవారం అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. భైంసా మండలం అస్గుల్ గ్రామానికి చెందిన నాగమణి మూడు రోజుల క్రితం ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈమెకు భర్త సాయినాథ్, ఇదివరకే ఒక పాప, బాబు ఉన్నాడు. భర్త వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తల్లి బిడ్డ ఆరోగ్యంగానే ఉన్నారు. అయితే మధ్యాహ్నం తర్వాత నుంచి నాగమణి కనిపించలేదు. దీంతో బంధువులు ఆస్పత్రి ఆవరణలో వెతికారు. ఆచూకీ లేకపడంతో భర్త సాయినాథ్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో సాయంత్రం ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు ఆస్పత్రికి వెళ్లి సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఇందులో నాగమణి తానే స్వయంగా బెడ్ మీది నుంచి ఆస్పత్రి బయటకు వెళ్లినట్లు రికార్డు అయింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

పురుగుల మందు తాగి విద్యార్థిని ఆత్మహత్య

ఇంద్రవెల్లి: పురుగుల మందు తాగి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం మండలంలోని దస్నాపూర్‌గూడ గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. దస్నాపూర్‌గూడ గ్రామానికి చెందిన జవాదే విలాస్ –కవిత దంపతుల కూతురు జవాదే అంజలి(13) బజార్‌హత్నూర్ మండలకేంద్రంలోని కేజీబీవీలో 8వ తరగతి చదువుతోంది. శుక్రవారం ఉదయం తల్లి కవితతో కలిసి వ్యవసాయ చేనులో పత్తి ఏరడానికి వెళ్లింది. సాయంత్రం నీళ్లు తాగి వస్తానని తల్లితో చెప్పి ఇంటికి వెళ్లిన అంజలి ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి స్పృహ కోల్పోయింది. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా ఆటోలో మండలకేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో 108 అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. కాగా ఆత్మహత్యపై ఎవరూ ఫిర్యాదు అందలేదని ఎస్సై దుబ్బక సునీల్ తెలిపారు.

ఉరేసుకుని ఒకరు..

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): ఆదిలాబాద్ పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన హబీబ్ ఖాన్(42) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు జైనథ్ ఏఎస్సై ఆత్మారాం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఖుర్షీద్‌నగర్‌కు చెందిన హబీబ్‌ఖాన్ తన రెండో భార్య మర్డర్ కేసులో నిందితుడిగా ఉన్నాడు. జైలుకు వెళ్లి ఇటీవల బయటకు వచ్చాడు. జైనథ్‌మండలంలోని మేడిగూడలో తన మొదటి భార్య జమీలా పిల్లలతో కలిసి పుట్టింట్లో ఉంటుంది. కాగా శుక్రవారం మేడిగూడ గ్రామ సమీపంలోని పంట పొలాల్లో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన జేబులో ఉన్న సూసైడ్ నోట్‌లో తన రెండో భార్యను హత్య చేశానని, తనకు జీవించే హక్కు లేదని ఉన్నట్లు ఏఎస్సై తెలిపారు. తన ఆత్మహత్యకు మొదటి భార్య, పిల్లలకు సంబంధం లేదని అందులో రాసి ఉందన్నారు. కాగా భార్య జమీలా తన భర్త కొంతకాలంగా మద్యానికి బానిసై తనను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, పలుమార్లు నచ్చజెప్పినా వినిపించుకోలేదని తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వివరించారు.

రుద్రాపూర్‌లో కుక్కల బీభత్సం



కర్రలు పట్టుకుని తిరుగుతున్న గ్రామస్తులు

చింతలమానెపల్లి(సిర్పూర్): మండలంలోని రుద్రాపూర్‌లో పిచ్చికుక్కలు బీభత్సం సృష్టిస్తున్నాయి. శుక్రవారం ఒక్కరోజే ఏడుగురు పిచ్చికుక్క దాడిలో గాయాలపాలయ్యారు. వశాకె శ్రీనివాస్, గంగాధరి భాగ్య, లెండుగురె రాజయ్య, దుర్గం కమలాకర్, మోర్లె కమల, గుర్లె రమేశ్ కుక్కకాటుకు గురయ్యారు. బాధితులు బెజ్జూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో చికిత్స పొందుతున్నారు. గ్రామంలో శుక్రవారం నుంచి సప్తాహం ప్రారంభం కాగా భక్తులు ఆలయంలో పూజలకు హాజరవుతున్నారు. మరోవైపు రైతులు వ్యవసాయ పనులకు వెళ్తున్నారు. రాత్రివేళ పిచ్చికుక్కల భయంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. యువకులు కర్రలతో గస్తీ కాస్తున్నారు.

కారు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు



కారు ఢీకొని గాయపడిన తిరుమల్

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాత బెల్లంపల్లి క్రాసింగ్ సమీపంలో శుక్రవారం సాయంత్రం కారు ఢీకొని లంబాడితండాకు చెందిన ధరావత్ తిరుమల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రహదారిపై లంబాడితండా నుంచి పాతబెల్లంపల్లి వైపు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో ఎగిరి డివైడర్‌పై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఢీకొట్టిన కారు ఆపకుండా వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ను సంప్రదించగా.. ఇప్పటివరకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఒకరిపై హత్యాయత్నం కేసు

ఖానాపూర్: మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధిలోని కొమ్ముతండాకు చెందిన జి.రమేశ్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. గ్రామంలోని కిరాణ దుకాణం నిర్వాహకుడు జి.రమేశ్‌కు అదే గ్రామానికి చెందిన సమీప బంధువు గుగ్లావత్ రమేశ్‌నాయక్‌కు పాత గొ డవలు ఉన్నాయి. జి.రమేశ్ గురువారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న గుగ్లావత్ రమేశ్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించేందుకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి కేకలు వేయడంతో పారిపోయాడు. ఈ మేరకు గుగ్లావత్ రమేశ్ తల్లిఇచ్చిన ఫిర్యాదు మేరకు జి.రమేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నామని ఎస్సై తెలిపారు.